# మణి

అడ్డపుశిల పార్వతీపురానికి నాలుగు మైళ్ల దూరంలో ఉంది. ఊరు నానుకుని ఓ కొండ, కొండ మీద చిన్న శివాలయం. నల్లగా ఎత్తైన కొండ మీద క్రొత్త సున్నంతో మెరుస్తున్న ఆలయాన్ని చూసి, ఏనుగు మీద అంబారీలా ఉందని వర్ణించాడు కవి. ఆలయం బహు ప్రాచీనమైనది. శివరాత్రికి అక్కడ పెద్ద తీర్థం జరుగుతుంది. వేలాది ప్రజలు కాలినడకన రెండెడ్లబళ్లలోనూ శివరాత్రి పొద్దునే చేరుకుంటారు ఆ ఊరు. చెరువులో స్నానం చేసి, శివార్చన చేసుకొని, ఆ రోజంతా అక్కడ గడిపి, రాత్రి జాగరం చేసి (హరికథలూ, బుర్రకథలూ, పురాణ కాలక్షేపాలూ, నాటకాలు, చీట్లపేకలూ జాగరణ సాధనాలు) మరుసటి రోజు స్వగ్రామాలకు తరలివెళతారు మోక్షగాములు.

నాటు బండి తప్ప మరో ప్రయాణ సాధనం లేదా ఊరికి. రైలు దారి నాలుగు మైళ్ల దూరంలో ఉంది. ఇక పార్వతీపురాన్ని కలిపే దోవకి, రోడ్డు అనే మాట దానికి వర్తింపచేయడం కష్టమే అయినా, దారికి ప్రత్యామ్నాయంగా వాడేస్తుంటారు ఆగ్రామస్తులు.

కామాక్షమ్మకు ఐహిక వాంఛలేవీ లేవు. భర్తపోయి మూడేళ్లయింది. ఆమెకు కావలసిన వన్నీ ఉన్నాయి. రత్నం లాంటి ఒక్కగానొక్క కొడుకు, డాక్టర్ చదివి పైదేశాలు తిరిగి వచ్చాడు. ఆమె భర్త బతికుండగానే. ఆమె చింతంతా ఒక్కటే, ఒక ఇంటివాడు కావడం చూడలేదే అని. శివరాత్రికి అడ్డపుశిలలోని ప్రాచీన శివాలయంలో అర్చన చేద్దామన్న సంకల్పం కలిగి కొడుకు కరుణతో చెప్పింది మధ్యాహ్నం అతను భోజనానికి వచ్చినపుడు.

"రేపు రాత్రి శివరాత్రి, అడ్డపుశిల వెళదామనుకుంటున్నాను"

"ఈ కోల్డ్ వేవ్ లోనా, అక్కడికే వెళ్లాలని ఎక్కడుంది. శివాలయం ఇక్కడ ఉందిగా?"

"అది కాదురా ..."

వాక్యం పూర్తి చెయ్యనివ్వలేదు కరుణ. "ఏమిటో నమ్మా, ఇంత చలిలో నువ్వెక్కడికీ వెళ్లడం నాకిష్టం లేదు. ఇక్కడే జానెడు దూరంలో ఉన్న బాపన్న కోనేరులో స్నానం చేసి ఒడ్డునున్న శివాలయంలో అభిషేకించ కూడదూ, శాస్త్రిగారికి కబురంపుతాను!"

"కాని తీర్థసేవ ..."

"పోనీ తీర్థసేవే కావాలంటే, కారు పంపుతాను, గుంప వెళ్లి రారాదూ? నాగావళిలో స్నానం, వెలసిన కోవిలలో అర్చన."

పొద్దున్న ఎనిమిదింటికి యాత్ర, మధ్యాహ్నం భోజనం తరువాత రెండు చెంచాల మందూ, అన్న ధోరణిలో చెప్పాడు కరుణ.

కామాక్షమ్మకు గడచిన శివరాత్రులు జ్ఞాపకం వచ్చాయి. సంజీవ రావుగారు శివభక్తులు. ఏటేటా ఎడ్లబండి మీాదా కొన్నాళ్ల తరువాత గుర్రం బండి మీాదా, మరి కొన్నాళ్ల తరువాత కారు మీాదా, కామాక్షమ్మను గుంప తీసుకెళ్లి తీర్థం సేవిస్తూ ఉండేవారు.

"అది కాదబ్బాయ్! గుంప ఎప్పుడూ వెళుతున్న క్షేత్రమే. ఇన్నాళ్లై ఈ ఊళ్లో ఉంటున్నా అడ్డపుశిల అనుకోవడమే కాని ఎప్పుడూ వెళ్లలేదు. నిన్న గౌరి చెప్పింది ఆ ఆలయం చాలా గొప్పదని. మళ్లీ శివరాత్రికి ఉంటానో శివసాన్నిధ్యాన్నే చేరుతానో – గౌరి తోడు వస్తానంటోంది. బండి కూడ మాటాడేసింది."

"సరే వెళ్లు. చలికి మాత్రం సరియైన ప్రొటెక్షన్ తీసుకెళ్లు – బండి కుదుపు నీకు తెలీదు. కీళ్లనీ వదులైపోతాయి. ఏం అహల్యా, నిజమేనా, నేచెప్పినది!"

ఏ విషయంలోనైనా మరోసారి అహల్య కన్ఫర్మేషన్ పొందడం అలవాటైపోయింది కరుణకు.

తలవంచుకుని భోజనం చేస్తున్న అహల్య తన నిశ్చయాన్ని చెప్పింది.

"పోనీ, అన్నయ్యా, దైవదర్శనం కోసం శ్రమదమాదులనుపడడం, దర్శనం కంటె ఎక్కువ పుణ్యకార్యమని మనవాళ్ల నమ్మక. గౌరి తోడుంటుందిగా. మిగిలిన ఏర్పాట్లన్నీ నేచేస్తా!"

అక్కడికి ఆ నిర్ణయం తీసుకోవడం జరిగి పోయింది. మధ్యాహ్నం పనిలోకి వచ్చిన గౌరి పొద్దున్నే దర్శనం చేసుకోవడానికి వీలుగా పెందరాళే బండి తెస్తాననీ వెంకటస్వామి చెప్పాడనీ, సిద్ధంగా ఉండమనీ చెప్పింది.

మఱుసరి రోజు పొద్దున్న అదే పనిగా బజర్ మోగుతూంటే అహల్య కిందకి వచ్చి తలుపు తీసింది.

"అదేంటే గౌరీ, అలా కొట్టేస్తున్నావ్, నేను కిందికి దిగి రావాలా?"

"అయిపోనాదటమ్మా, రామారావ్ ఒటల్ కాడ గంట సూసినాడు ఎంకటసామి."

కామాక్షమ్మ బజర్ శబ్దం విని దిగిరానే వచ్చింది.

"పిన్నీ, అక్కడ స్నానం చేసే కంటె, ఇక్కడే స్నానం చేసి బయలు దేరరాదూ?"

"అదెలా పనుకొస్తుందే". అంటూ తొందరగా తెమిలి పోయింది కామాక్షమ్మ. వెంకటస్వామి బండిలో పరుపు, దిండ్లూ వేశాడు. రగ్గూ, స్వెటరూ, శాలువా, ఇంకా ఏమిటేమిటో సర్దేసింది అహల్య"

"అహల్యా, కరుణా, మీరు ఆస్పత్రి అంటూ అన్నం మరచిపోక పెందరాడే ఇంత తిని మరో పని చూసుకోండి. నేను పొద్దున్నే మరో సారి దర్శనం చేసుకుని వచ్చేస్తా! ఒరేయ్ పొట్టిగా, ఇల్లు జాగ్రత్త!" స్టూలు మీద నించి బండి ఎక్కింది కామాక్షమ్మ

బండి ఊరు దాటింది.

"తీర్థంలో ఏటేటి కొంటావ్ గౌరమ్మా? రంగులరాట్నం ఎక్కుతావా? నీకేం బయంనేదులే నేను ఉంటా!" వెంకటస్వామి కదిపాడు.

"రంగులరాట్నం నువ్వెక్కుతావా? పళుక్కున ఇరిగి పోదూ?"

"ఇరిగిపోదు నేవే, చిన్నదనుకుంటున్నావేటి; ఎంత ఎత్తుంటుందో తెలుసా ... అంతా ఎక్కిన తరువాత తిప్పుతారు. కింద నుంచీ, మాసరదాగుంటాదనుకో!" బండి ఇరుకుగా ఉన్న ఓ గోరిజలో ప్రవేశించింది. బండి చక్రాలకు పక్కనున్న గుబుర్లు తగిలి రాస్తుంటే వింతైన శబ్దం.

"గౌరీ, మీ అమ్మ నీ పెళ్ళి సంగతి ఏమి చేసిందే?"

తీరుబడిగా అడిగింది కామాక్షమ్మ.

"అదెందుకు తలపెడతారమ్మ గోరూ, పిల్ల అత్తోరింటికెళ్ళితే టీ కొట్టెవడు జూత్తాడు?"

గౌరి మనసు చివుక్కుమంది.

అయ్య సచ్చిపోయాక తనను పట్టుకుని, ఆ ఇంటా, ఈ ఇంటా పన్జేసి మెల్లగా టీ దుకాణం పెట్టింది. ఎనిమిదేళ్ళ గౌరిని లాయరుగారింట్లో పనికి కుదిర్చింది లాయరుగారు మకాం ఎత్తేసాక డాక్టరుగారింట్లో.

నాటుదోవ వల్ల కుదిపేస్తోంది.

"వెంకటస్వామీ సగం దోవ వచ్చామా?"

"వచ్చామండమ్మగోరూ, అదేటి, ఆ తాటిచెట్లెనకే ఉంది ఊరు!"

తాటిచెట్ల దగ్గర కొచ్చేసరికి ఏడు దాటింది.

"ఇదిగో నమ్మగోరూ, ఈడే తీర్థం జరుగుతాది. బండి ఊళ్ళోకి తీసుకెళ్ళమంటారా, ఎడ్లనీడే ఇప్పేమంటారా?"

బండి దిగితే చాలనుకుని గౌరి సాయంతో బండి దిగింది కామాక్షమ్మ.

"అమ్మగోరూ, నే ఎడ్లకు మేతపడేసి ఆ ఎనక గుడికెళతా. మీరు గౌరీ ముందు పదండి. బండికాడ నేనుంటా!"

కథా నిలయం
3936
శ్రీకాకుళం

గౌరి, కామాక్షమ్మా కోనేటికేసి నడిచారు. ఇంకా తీర్థ [illegible] కోనేటికి పోక లేదు. ఓ పక్కగా రేవు దగ్గర స్నానం ముగించుకున్నాక ఇద్దరూ గుడి కెళ్లారు.

"కౌండిన్యసగోత్రిం, కామాక్షమ్మ" గోత్రినామాలు చెప్పిందిపూజారికి. రుద్రాభిషేకానికి సంచితో కొబ్బరి కాయలు! పూజా సామగ్రి పట్టుకొచ్చింది గౌరి.

"ఈ గుళ్లోంచి కాశీకి సొరంగముందట నిజంవేనా?" గౌరి పక్కనున్నాయన్ను అడిగింది.

"అవునమ్మా! ఈ బండల మధ్య చిన్న చీలిక కనబడడం లేదూ, ఆ చీలిక ఒకప్పుడు చాలా పెద్దగా ఉండేదట. ఆ చీలిక వెంట వెడితే విశ్వేశ్వర సన్నిధికి ఓ సొరంగ మార్గం కనపడేదట. కాని ఓ భూకంపం వచ్చి సొరంగం అడ్డుగా ఓ శిల పడిందనీ, చీలిక మూసుకుపోయిందనీ చెబుతారు. ఇప్పుడల్లాంటివి నమ్మే వాళ్లు ఎవరున్నారు తల్లీ!"

అర్చన అయిన తరువాత బండి దగ్గర కొచ్చారిద్దరూ. తీర్థ ప్రజ విరివిగా వస్తున్నారు. మొత్తాల మీద కాలేసి జనంలోకి చూస్తున్నాడు వెంకటస్వామి.

"అమ్మగోరూ! నేనెల్లి తానం సేసొత్తా. బండిలో కూకోండి. గౌరమ్మా, అమ్మగారి దగ్గరే కూకో. నే ఒచ్చేత్తా!"

దిండు కింద మహాభాగవతాన్ని తీస్తూ అహల్యను మెచ్చుకుని, అష్టమ స్కంధంలో సప్తమాధ్యాయం చదువుతుండగా కామాక్షమ్మకు దగ్గరగా నాదస్వరం వినపడింది.

అధ్యాయం చివరకు వచ్చింది. శివుని హాలహాల భక్షణ ఘట్టం పూర్తిచేసి బండిలోంచి కిందకు దిగింది. గౌరి బండి చక్రిం వద్దనుంచుంది.

ఓ పదిగజాల దూరంలో పాములవాడు గుండ్రని వెదురు పెట్టెలోంచి పాములను తీసి ఆడిస్తున్నాడు. పాములవాడి కొడుకులా ఉన్నాడో

యువకుడు మధ్య మధ్య ఒక్కొక్క బుట్టతీసి అందులో పాము బయటకు తీసి చూపించి దాని గురించి చెబుతున్నాడు.

"ఇది సూడండి బాబూ, సంపెంగ నాగు. అల్లంత దూరాన గుప్పున వాసన ..."

బారెడు పాము చూడడానికి భయం గొలుపుతూ ఉంది. నాదస్వరం విని పడగ విప్పింది సంపెంగ నాగు.

గౌరి ఎవరితోనో చెబుతోంది! "నాగుపామూ, జెర్రిపోతూ పోట్లాడుకుంటాయట. అది చూసినోళ్లకు ఎంత అదృష్టమంట!"

ఎండలో పాము పడగ వింతగా మెరుస్తోంది.

"చూడండమ్మోయ్! ఇది కోడెనాగు. సినిమా నాగు కాదొమ్మోయ్. అసలు కోడెనాగు." గౌరి దగ్గరకు వచ్చి చూపించాడు.

చక్రానికి కరుచుకు పోయింది గౌరి భయంతో.

పాములను ఆడించడం అయిపోయిం తరువాత పాములవాడు వెదురు పళ్లెంలో మూక చుట్టూ తిరిగి చిల్లర పోగు చేసుకున్నాడు.

కామాక్షమ్మ గౌరిని పిలిచి ఓ అర్ధరూపాయి చేతి కిచ్చింది.

బండి చక్రం దగ్గర నిలబడి చూస్తున్న గౌరిని ఓ కంట కనిపెడుతున్న పాములబ్బాయి జమీందారిణిలా కనబడుతున్న కామాక్షమ్మ గారిని దగ్గరకు పిలచి చేతిలో ఏదో పెట్టడం చూశాడు. చిల్లర మధ్య అర్ధరూపాయి కనబడింది పాము లబ్బాయికి.

"డబ్బుగల మారాజులు! అమ్మా, మణి, నాగుపాము మణి" కామాక్షమ్మ దగ్గరకు తీసుకొచ్చాడు.

నల్లగా కాకరగింజలా ఉంది. "సుసావా పిల్లా, మణి మహత్తెం సూపించమంటా వేటి?"

"సూపించు. సూత్తా" బండి చక్రానికి చేరగిలబడ్డ గౌరి కొద్దిగా ముందు కొచ్చింది.

మిసమిసలాడుతున్న జబ్బలతో, కోరమీసాలతో, నవ్వులు చిందించే ముఖంతో, కంఠంలో గర్వంతో కలకల లాడుతున్నాడు పాములబ్బాయి. ముఖానికి పసుపు రాసుకుని పాతకాలం కాని అంత బొట్టెట్టుకుని నుదుటను జుట్టు పడుతూ, ఆరబోసుకోక పోయినా ఆరి పోతున్న జుట్టుతో జిగ్గని మెరిసిపోతోంది గౌరి ...

ఇద్దరినీ చూస్తోంది కామాక్షమ్మ.

"ఇదిగో కరిపించేసుకుంటా. ఈ నాగుపాము చేత, సూత్తుండగా ఇసం పీల్చేస్తాది సూస్కో."

చటుక్కున ఓ బుట్ట మూతతీసి లోపల వేలెట్టాడు పాములబ్బాయి.

"అబ్బ నీసిగదరగ!" చెయ్యి బయటకు లాగేశాడు ... మణిని వేలికి నొక్కి పట్టాడు. "ఇసం పీల్చేసినాది మణి" అన్నాడు పాములబ్బాయి.

టీ దుకాణం దగ్గర కెళ్లి కాసిని పాలు గ్లాసులో తీసుకొచ్చాడు పాముల వాడు.

మణి గ్లాసులో వేశాడు.

పాలు కాఫీ డికాషన్ రంగులోకి మారిపోయాయి.

"సూసినావా, మణి మహిమ!" – ఓరగా చూశాడు గౌరి వంక పాములబ్బాయి.

గౌరి బండి దగ్గరకు వచ్చేసింది.

"అమ్మా, ఆ మణి అమ్ముతాడేమో అడుగుతా, కొంటారమ్మా? చాలా మంచి మణిలా ఉంది."

"పోనిలే, అడగవే కొందాం, ఎంత కిస్తాడో కనుక్కో?"

"మారాజులు మారాజులు" అంటూ మణి పట్టుకుని పాములబ్బాయి బండి దగ్గరకు వచ్చాడు.

"పది రూపాయలు ఇయ్యండమ్మా. అసలు నాగు మణి. పేనం నిలబెట్టే మణి!"

పది రూపాయల నోటు పట్టుకెళ్లిపోయాడు పాములబ్బాయి గౌరి వైపోసారి చూసి. మరి కాసేపట్లో బుట్టలు కావిడి వేసుకుని పాముల వాళ్లు మరో పక్కకు పోయారు.

పగలంతా భాగవతం చదువుతూ గడిపేసింది కామాక్షమ్మగారు. రాత్రి కోటేశ్వరరావ్ భాగవతార్ హరికథా కాలక్షేపం. అర్ధరాత్రి మరోసారి కోవెలలోకి వెళ్లింది కామాక్షమ్మ —

తెలతెలవారుతుండగా తిరుగు ప్రయాణం కట్టారు.

గౌరీ, వెంకటస్వామి ఏమిటేమిటో మాట్లాడుకుంటున్నారు.

కరుణ పెళ్లి తన కళ్లతో చూస్తానా అని ఆలోచిస్తోంది కామాక్షమ్మ. వెళుతున్నప్పటి కంటె తిరుగు ప్రయాణం సుఖంగానే అయింది.

"తీర్థం బావుందా గౌరీ!" స్నానం చేసి బాత్ రూమ్‌లోంచి వస్తూ కరుణ అడిగాడు.

"బలే బాగుంది బాబూ! సారంగం మాత్రం మూసుకు పోయినాదట!"

"అలాగా!" — మేడ మీదకు వెళ్లిపోయాడు కరుణ. అహల్య ఉప్మా చేస్తోంది. కామాక్షమ్మగారు రాగానే స్నానం చేసి పూజకని పువ్వుల కోసం పెరట్లోకి వెళ్లింది. సంపెంగ చెట్టు కింద గౌరి నిలబడి ఏదో పరాకుగా ఆలోచిస్తోంది. పువ్వులు కోసుకుని పూజకు కూచుంది కామాక్షమ్మ.

బట్టలు వేసుకుని కింద భోజనాల గదిలోకి వచ్చాడు కరుణ.

"ఉప్మా తిని చెప్పు అన్నాయ్ ఎలా ఉందో!"

"వండర్ ఫుల్, అమ్మా నువ్వూ రుచి చూడు!"

"నే నిన్న ఉపవాసం, ఈ రోజు పెందరాడే ఓ బ్రాహ్మడికి పెట్టి మరీ తింటా. శాస్త్రిగారికి కబురు పంపు, పది గంటల కల్లా రమ్మని."

పొట్టిగాడు హడావిడిగా పరిగెత్తు కొచ్చాడు ద్వారం దగ్గరికి.

"బాబూ, బాబూ! అర్జంటు పాము కరిచేసిందట!"

"ఎవరినిరా?"

"ఎవర్నోనమ్మా, బండి మీద తీసుకొచ్చారు."

"హమ్మ!" అనుకుంది కామాక్షమ్మ.

సంపెంగ చెట్టు కింద గౌరి నిలబడడమే ఏదోలా అనిపించింది. పాము కరిచిందనగానే గౌరినేమోనని తుళ్లిపడింది.

కరుణా, అహల్యా లేచి వీధి వరండాలోకి వెళ్లారు.

"గౌరీ! గౌరీ!" పెరట్లోకి కేకేసింది కామాక్షమ్మ.

పరుగు పరుగున వచ్చింది గౌరి.

"ఎవరినో పాము కరిచిందిట. మనం కొన్న మణి ఏదీ?

"మీకే ఇచ్చేశానమ్మా! కొంగున ముడేసు కున్నారూ?"

"అయ్యయ్యో! అచీరతోనే స్నానం చేశా. డాబా మీద ఆరేసి నట్టున్నావ్, వెళ్లి తీసుకురా!" ఆమాటలంటూనే తనూ వీధి వరండా లోకి వచ్చింది.

"అహల్యా, ఎడ్రినలిన్, క్విక్?"

ఇంజక్షన్ ఇస్తూనే అడిగాడు కరుణ పాము కుట్టి ఎంతసే పయ్యిందని.

"పొద్దు గూకులే బాబూ. నిన్న అడ్డశిల తీర్థానికి వెళ్లినాం, నాలుగు రాళ్లు దొరుకుతాయ్ కదా అని. రాత్తిరి సింతసెట్టుకాడ మకాం ఏసినాం. తెలతెలవారుతుండగా కుర్రోడు లేసి బయటకు వెళ్ల బోనాడు, తొక్కేసినాడు గొడ్డుని. మంత్రాలేసినాను, ఏటి నాబం, గిలగిల్లాడిపోనాడు. చెమటవొట్టిపోనాడు. కాలు ఓసిపోనాది. ఓ శే గొంతులు-మాటాడితే అదే వాగుడు, లేదా ఒదిగిపోతన్నాడు. తీర్థంలో బండి దొరకడమే కష్టమైపోనాది."

"ఇదిగోనమ్మా మణి." గౌరి వచ్చింది.

బల్లమీద మనిషిని చూసి కొయ్యబారిపోయింది.

"నీ దేవూరయ్యా!"

"మాకో ఊరేటమ్మా, నిన్న అడ్డపుశిల తీర్థాని కెళ్లినాం. అక్కడే కాటేసింది మాయనాగు." – బావురుమన్నాడు పాములవాడు.

"అసలేం పామో తెలుసా, నువ్ చూశావా?" పేషెంట్ వైపు చూస్తూ పాములబ్బాయి నడిగాడు కరుణ.

"ఏదో కనపడనేదు బావ్వూ, తాచు పామేమో!"

"పోలీ వెలెంట్ యాంటీ వెనమ్ ట్రై చేస్తే?" అహల్య అడిగింది.

"వెరీ ఎక్స్‌పెన్సివ్. బట్ లెట్ అజ్ ట్రై!"

పేషెంటుకు ఒంటి మీద స్పృహ లేదు. స్పర్శజ్ఞానమూ లేదు. అతని ముఖంలోకి చూస్తున్న కరుణ, అహల్య ఫ్రిజ్ తియ్యబోతుంటే అన్నాడు, "సారీ అహల్యా! న్యూరోటాక్సిన్ ఫాక్టర్స్ ఆర్ ప్రిడామినెంట్. పల్స్ కూడా ఫెయిల్ అవుతోంది. ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్ ట్రై చేద్దాం"

"అబ్బాయ్, మణి పెట్టరాదూ, ఇది పని చెయ్యడం నేచూశా!"

శ్వాస ఆడించడానికి ప్రయత్నం చేస్తున్న కరుణ తల్లి మాటలు వినిపించుకో లేదు. మరో ఐదు నిమిషాలు గడిచాయి.

గారి చేతిలో మణి పట్టుకుని అల్లాగే నుంచుంది.

"అహల్యా, ఇక మనం చెయ్యగలిగిందేమీ లేదు. ఇటీజ్ ఎ మేటర్ ఆఫ్ మినిట్స్ ఫర్ హిమ్. రెస్పిరేటరీ సెంటర్ ఇన్‌వాల్వ్ అయిపోయింది. ఫెలో విల్ డై!"

"మణే పెట్టరా!"

"మణా! అదెక్కడిదీ?" – వరండా మీద కొచ్చిన తల్లిని చూసి ఆశ్చర్యంగా అడిగాడు కరుణ

"నిన్న ఈ మనిషి దగ్గరే కొన్నాం బాబూ! పాము కరిపించి చూపించినాడు. యిసం లాగేసినాది మణి. పాలు నల్లగా అయి పోయినాయ్."

పాములవాడు కిందపడి దుఃఖంతో చుట్టుకుపోతున్నాడు.

కరుణకు విషయం బోధపడింది.

"అమ్మా, ఈ అబ్బాయిని రక్షించాలనే నీ ప్రయత్నం సమంజసమే. కాని పాము పడగ మీద మణులనేవి ఉండవ్. ఆ పేరు పెట్టి వేటినో అమ్మడం పొట్ట పోసుకునే కోటి మార్గాలలో ఒకటి. అదినీ కమ్మి పదో, పాతికో చేసుకున్నాడు దౌర్భాగ్యుడు. వాడికర్మ, రోజు పాములనాడిస్తూ పాము కాటువల్ల చావడం!"

"నాయుడూ! ఇంకెందుకిక్కడ? కొన ఊపిరితో ఇంటికి తీసుకుపో కుర్రోడిని!".

పొట్టిగాడి సలహా కటువుగా తోచింది కామాక్షమ్మకి.

బండి వీధి మలుపు తిరిగే వరకూ కింద రోడ్డు మీద కొచ్చి చూసిన గౌరి వరండా మీద కొచ్చి గోడకు చేరగిల బడి పోయింది.

యువ — అక్టోబర్ 1975 లో ప్రచురితమైనది.